# వేమన పద్య అనుశ్రుతి

శిష్ట్లా వెంకటాచల మూర్తి



శిష్ట్లా వేంకటాచలమూర్తి 1946లో సూర్యనారాయణమూర్తి, సావిత్రమ్మ దంపతులకు కృష్ణాజిల్లా, దివి తాలూక కృష్ణానది తీర గ్రామమైన నాగాయలంకలో జన్మించారు. ఆ గ్రామములోనే హైస్కూలులో చదివి తరువాత మచిలీపట్నంలోని హిందూకాలేజీలో చదివి రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ, వరంగల్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పట్టభద్రులైనారు. ఉద్యోగాల గురించి విచారించక తాను స్వయం ఉపాధిగా ఒక వర్క్‌షాపు పెట్టి, ఆ తర్వాత కాంట్రాక్టు పనులలో నిమగ్నమై కన్సల్టెంటుగా చివరి వరకు 40 ఏళ్ల పాటు తమ వృత్తిని సాగించారు.

వీరు సమాజానికి ఎదురైన, అవసరమైన అంశాలు టెక్నికల్ పేపర్లు నలభై పైగా వ్రాస్తే దేశంలోని అనేక మాగజైన్లలో ప్రచురింపబడినాయి. అనేక సెమినార్లలో ఆయన ప్రసంగించారు. అనేక సంస్థలలో సంస్థాగత ఉద్యోగులకు లెక్చర్లు, ప్రసంగాలు ఇచ్చేవారు. ఈ ప్రవృత్తిలో వీరు దేశమంతా 30 ఏళ్లపాటు తిరిగి తమ విజ్ఞానాన్ని పంచి పెట్టారు. స్వచ్ఛంద సంస్థలతో పనిచేస్తూ గ్రామాలలో దశాబ్దం పాటు సేవలు చేశారు. వీరి రచనావ్యాసంగం ఈ సేవలలో విరివిగా ఉపయోగించి జన మన్ననలను పొందారు.

జట్రోఫా (అడివి ఆముదం) సాగు మీద, దాని ఇంధన వినియోగం పై ఒక అనువాదాన్ని ప్రభుత్వం ద్వారా ప్రచురించి పంచారు. అనేకచోట్ల ఈ విషయం పై ఉపన్యాసాలు ఇచ్చారు. మెకానికల్ ఇంజనీర్ అయినప్పటికి ఎలక్ట్రికల్ కన్సల్టెంటుగా ముప్పై సంవత్సరాలు సేవలందించి 'ఇండియన్ ఎలక్ట్రిసిటీ రూల్స్' అనే అనువాద పుస్తకాన్ని తెలుగులో (2005లో) ప్రచురించారు. 2015లో 'ఎలక్ట్రిసిటీతో భద్రత' అనే అంశంపై ఇంగ్లీషులో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. తెలుగులోని నీతి శతకాలను ఇంగ్లీషులో వ్యాఖ్యానించి ప్రపంచ ప్రజలకు తెలియజేయాలనే సంకల్పంతో ప్రస్తుతం పనిచేస్తున్నారు.

# వేమన పద్య అనుశృతి

**వేమనార్యుని పద్యధోరణిలో అనుసరణ మరియు స్పందనతో**
**స్వయంకృత అనుశృతి తెలుగు భాషలో**

**శిష్ట్లా వెంకటాచల మూర్తి**



# వేమన పద్య అనుశృతి

**వేమనార్యుని పద్యధోరణిలో అనుసరణ మరియు**
**స్పందనతో స్వయంకృత అనుశృతి తెలుగుభాషలో**

*తెలుగు అనుసరణ*
**శిష్ట్లా వేంకటాచలమూర్తి**

కాపీలకు
**శిష్ట్లా వేంకటాచలమూర్తి**
జి–2, శ్రీ వేంకటసాయి హైట్స్, రోడ్ నెం. 6
ప్రశాంతి హిల్స్, నిజాంపేట్, హైదరాబాద్–500090
ఫోన్: 81795 12034

**శిష్ట్లా రామకృష్ణ కోటె**
ప్లాట్ నెం. 22, చైతన్యభారతి స్కూల్ ప్రక్కన
గణేష్‌నగర్ కాలనీ, ఉప్పల్
హైదరాబాద్–500039
ఫోన్: 92462 08977

**శిష్ట్లా సురేష్**
శాండియాగో, యుఎస్ఎ
ఫోన్: 858 228 6284, 978 944 6151

*కవర్ & కూర్పు*
**అక్షర క్రియేటర్స్,** హైదరాబాద్

*ప్రింటింగ్*

# కృతిభర్త



## శిష్ట్లా విజయసింహ ప్రసాద్

**(14.1.1950 - 22.8.1992)**

*డా॥ ఎస్.వి.ఎస్.గారు 1950 జనవరి 14న నాగాయలంక గ్రామంలో జన్మించి 1992 ఆగస్టులో మద్రాసులో పరమపదించారు. యిలాంటి మహాపురుషులు ఈ జనావళి కోసం వస్తూనే ఉంటారు. అటువంటి వారికే ఈ చిరుకృతి అంకితం.*

# వేమన - వేమనశృతి

## శిష్ట్లా వేంకటాచలమూర్తి

అనేక వేల తెలుగు పద్యాలను ప్రజానీకం కోసమై యిచ్చి తెలుగుభాషలో అత్యంత పరిశోధనలు, విశ్లేషణలు జరిగిన కవిగా ప్రాచుర్యం పొందాడు. ఆయనను కవి అనడం కన్నా సంఘ సంస్కర్త అనడం సబబు. 16వ శతాబ్దపు ఆంధ్రదేశంలోని మత మూఢాచారాల్ని దుయ్యబట్టి, ఒక్కడే పోరాటం జరిపిన ప్రజాకవి. ఈయన రచించిన పద్యం తెలియని తెలుగు వాడు ఉంటే అది అతని దురదృష్టం. వేమనకు అనేక వేల శిష్యులు, అతని అనుయాయులు అతని భావాల్ని, పద్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఈనాటికీ వాటిని బ్రతికించి వుంచారు. సంఘ సంస్కరణ ధ్యేయంగా తన జీవితాన్ని రంగరించి చెప్పిన మాటల్ని తెలుగునాట నానుడుల్లుగా రూపొందినాయి. ఏదైనా ఒక భావాన్ని విశదీకరించాలంటే వేమన చెప్పిన పద్యాలలో నుండి పనికి వచ్చే పద్యం తప్పక వుంటుంది.

వేమన గురించి అనేకమంది నిశితంగా అధ్యయనం చేశారు. అందరికీ మకుటాయ మానమైన మనిషి ఆంగ్లేయుడు ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (19వ శతాబ్దం) ఆయన చేసిన కృషి ఈనాటికీ వేమనను ప్రత్యేక స్థానంలో నిలబెట్టి అందరి దృష్టిని ఆకట్టుకునేట్లు చేసింది. వేమన అధ్యయన కేంద్రాలు ఏర్పడి యింకా అధ్యయనాలు, విశ్లేషణలు జరుగుతూనే వున్నాయి. దీనితో ఆయన ఈనాటి ఆంధ్రదేశాన్ని కూడా జాగరణ చేయిస్తున్నట్లే కదా!

ఈ పుస్తకంలోనివి వేమనగారి కొన్నివేల పద్యాలలోని ఒక శతం మాత్రమే. ఈ ప్రక్రియలో వేమన పద్యం చదివినపుడు మనలో కలిగే భావోద్వేగానికి అద్దంపట్టి, నా భాషాపటిమ మేరకు (మాత్రమే) నా భాషలో వ్రాసిన గేయాలు తెలుగులో (Annotations) అనుశృతిగా చెప్పినవి, గేయరూపంలోని అనుకృతులు. నా గేయాలు చదివితేనే ఎంత చప్పగా వున్నాయో తెలుస్తుంది! వేమనార్యుని పద్యాలు ఎంత గంభీరంగా, సరళంగా, ముక్కుసూటిగా చెప్పబడినాయో కూడా విదితమౌతుంది. ఈ ప్రయోగంలో వేమనగారిని వెలుగులోకి తీసుకురావడం కూడా ఒక లక్ష్యము. పద్యపు బిగింపు ఆయనకే స్వంతం. అందుకే వారు వేమనగా చరిత్రలో వుండిపోతారు.

నేను చేసిన ఈ ప్రయోగం కొంతమందికైనా ప్రేరణ కలిగించి యిలాంటి బహు విధ ప్రయోగాలు తెలుగుభాషలో రావాలని ఆశిస్తూ 'వేమనగారి పద్య నిశితతను ఆస్వాదించి తెలుగువారు కండి!' అని దీవిస్తూ...

శిష్ట్లా వేంకటాచలమూర్తి
కృతికర్త

జనవరి 12, 2019

శాండియాగో, కాలిఫోర్నియా, యుఎస్ఎ

*(డా॥ ఎస్.వి.ఎస్. 70వ జయంతి సందర్భంలో)*

# వేమన పద్య అనుశ్రుతి

**వేమనార్యుని పద్యధోరణిలో అనుసరణ మరియు స్పందనతో**
**స్వయంకృత అనుశ్రుతి తెలుగు భాషలో**

**1.** **నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు**
**దలుకు బెలుకు రాలు తట్టెడేల?**
**జదువ బద్యమరయ జాలదా యొక్కటి**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*రవ్వంతైన రవ్వే వుంటే నిజమైన భాగ్యం*
*గాజు ముక్కలు కొన్ని వేలున్న లెక్కేమి?*
*చిన్ని చాటువులలోన చేవ ఎంతుందో*
*దాని నుండి పొందిన లబ్ధి దారుని అడుగు*
*చెత్త పదాలు వేలకు వేలు చేయునా మేలు?!*

**2.** **వేషభాష లెరిగి కాషాయవస్త్రముల్**
**కట్టినప్పుడే ముక్తి కలుగబోదు**
**తలలు బోడులైన తలపులు బోడులా!**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*కాషాయములు గట్టి బుర్ర గొరిగించుకొని*
*వాక్చరుత తోడ వేష భాషలు మార్చి*
*లోని ఆలోచనలన్ని తుడిచి వేసిన గాని*
*వాడిని నమ్మరాదు ఒక్క మాటైన!*

3. **తాను దిరుగు భూమి పీడితమైనc**
**బరగు దేశమునకు జరుగ వలయుc**
**గొలను యెండిపోవc గొక్కెర లుండునా**
**విశ్వదాభిరామ వినురవేమ !**

*నీవున్న చోట కరువు కాటకాలొస్తే!*
*లేని చోట్లకు త్వరగ తరలి పొమ్ము*
*తెలివి లేని కొంగలే తరలి పోవుట లేదా ?*
*అలవి కాని చోట్లకు అవలీలగా పోవు గదా!*

4. **కలుగc గలుగc బుట్టు గనకంబునకు వన్నె**
**పెనగc బెనగc బుట్టు బ్రేమ సతికి**
**ముదియ ముదియcబుట్టు మోహంబు లోభంబు**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*పుటము పెట్టిన కొద్దీ పుత్తడి వన్నె బెరుగు*
*వనితను అనుదినము లంకించితేనే దగ్గరగు*
*ఏళ్లు పైబడిన వానికి కామంపు గుల పెరుగు*
*జీవిత సత్యాలు తెలియుటే మరి వెలుగు*

5. **ఎక లేని దొరల నెన్నాళ్లు కొలిచిన**
**బ్రతుకులేదు వట్టి భ్రాంతి గాని**
**గొడ్డుటావు పాలు గోకినా చేపునా?**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*బతుకు భారము తెలియని కామందు కడ*
*బతికిన సుకమేమి కోత బతుకే దప్ప*
*గొడ్డు టావు పొదుగు రోజంతా పిసికినా*
*పాలు వచ్చునా వేళ్లకు వాతమొచ్చును గాని*
*అట్టి పనులను వేగమె వీడిన యుత్తమము*
*విశ్వదాభిరామ విశదముగా వినుమా!*

**6.** **గొడ్డుటావు బితుక గుండ గైకొని పోవ**
**బండ్ల నూడ దన్ను పాల నీదు**
**లోభివాని నడుగ లాభంబు లేదయా!**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*గొడ్డు టావును పాలు పిదుకగ బోతే*
*కుండను తన్నును వేళ్లు వాతాన బడు*
*పిసినారి వానిని బిచ్చమడిగితే ముప్పు*
*పైసలీయక వాడు పెడబొబ్బలే పెట్టు*
*ఇట్టి దండుగ పనులు చేయకుము వేమా!*

**7.** **కుండ పగిలెనేని క్రొత్తది కొనవచ్చు**
**భూతలంబునందు పొందుగాను**
**గూలఁబడిన నరుఁడు కుదురుట యరుదయా!**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*పగిలిన కుండను అతుకుట కష్టము*
*కొత్త కుండను కష్టించి కొనవచ్చు*
*పరిస్థితుల వలన పగిలిన హృదయాన్ని*
*పరిశ్రమించిననూ దాని నతుకుట కష్టమే!*

**8.** **స్వానుభూతి లేక శాస్త్రవాసనలచే**
**సంశయంబు విడదు సాధకునకు**
**చిత్రదీపమునను చీకటి పోనట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*గ్రంధ జ్ఞానము కన్న స్వానుభవము గొప్ప*
*దీపపు బొమ్మతో చీకటి పోవునా?*
*విశ్వదాభిరామ విశదముగ తెలియుమా!*

9. **చమురుగల్గు దివ్వె సంతోషముగ వెల్గు**
**ధనము గలుగు వాని తలఁపు జెలఁగు**
**ధనము తీఱఁ దలపుఁ దను దానె తీఱును**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*దీపపు వెలుగును తైలమే నిర్ణయించు*
*ధనము మానవుని కోర్కెల నిర్దేశించు*
*బీదలకు కలలు కనే యోగ్యత లేదు*
*ధనము గల వాడు కలల సాకారమే పొందు!*

10. **చమురు రాచి కొన్నఁ చర్మంబు మెఱుగెక్కు**
**సాముచేయ మేన సత్తు వెక్కు**
**జ్ఞానమార్గ మెఱుగఁ గడతేఱు జన్మంబు**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*తైల శుద్ధి తోడ తనువంత మెరియు*
*కత్తి సాము తోడ కండలు గట్టి పడు*
*జ్ఞాన సముపార్జనే ముక్తి మార్గంబిచ్చు*
*సాధన యె నీకు జీవిత సహయోగిగా నొప్పు!*

11. **బహుళ కావ్యములను బరికింపగా వచ్చు**
**బహుళ శబ్దచయము పలుక వచ్చు**
**సహన మొక్కటబ్బ జాల కష్టంబురా!**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

వేల పుస్తకాలను వైనముగా చదివినా
తేట భాష లెన్నో తెలివిగా పలికినా
ఓరిమిని కూరిమితో వడి బట్ట వేరయా
ఓరిమి గల వాడె రారాజు వసుధ లోన!

12. **దాగు పడిన వెనుక డాలుకొనగ లేవు**
**అరసి చేయుమయ్య యన్ని పనులు**
**తెలియకున్న నడుగు తెలిసిన వారిని**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*ఒక కార్యము చేయునెడ అవగాహన ముఖ్యము*
*అవగాహన కోసమై అడగాలి, తిరగాలి, తెలుసుకోవాలి*
*ఒకసారి సాఫల్యము కాని కార్యము చెడు ముద్రను వేయు నీపై*
*కార్య సాఫల్యత కొరకై వనరులన్నిటి పరిశీలన ముఖ్యమయా!*

13. **నీచగుణములెల్ల నిర్మూలమైపోవు**
**కొదవేలేదు సుజన గోష్టివలన**
**గంధ మలద మేని కంపడcగిన యట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*చెడ్డ గుణము లెల్ల చిటెకలో పోవును*
*మంచి వారి చెంత కొంత సేపున్నచో*
*కొద్దిపాటి మంచి గంధమ్ము పూసిన*
*దుర్గంధముల నెల్ల దూరముగ నెట్టు రా!*

14. **బోడి తలల వెల్ల బూడిద పూతల**
**భాషణాసనముల వేషములను**
**యోగు లైరె లోన బాగు గాకుండిన**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*బోడి తలలు బారు గడ్డాలు జులపాలు*
*బూది పూసిన యొడలు అర్ధం తెలియని మంత్రాలు*
*యివన్నీ ధాంభికులైన సన్యాసుల వేషాలు*
*లోపలా బయటా నిర్మలత్వము లేని దొంగలే వీరంతా!*

**15.** **వారకాంతలెల్ల వలచి యేతెంతురా**
**పొందు జేసి ధనము పుచ్చుకొనక**
**మారకమ్మ చొచ్చి మఱియిల్లు వెడలునా!**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*వెలయాలు నీ అందాన్ని చూచి మోహించదు*
*నీ కాసులు, నీవిచ్చే మూటల్ని చూస్తుంది*
*దండిగా ధనమున్నచో వచ్చి తలుపు తెరచును*
*ఒకసారి నిన్ను పట్టితే ఆమె, వల నుండి ఆవలకు పోలేవు సులువుగా!*

**16.** **కూలి నాలిఁజేసి గుల్లాపుఁ బనిజేసి**
**తెచ్చిపెట్ట నాలు మెచ్చుచుండు**
**లేమిఁ జిక్కు విభుని వేమాఱు దిట్టును**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*కూలి చేయ్ నాలి చేయ్*
*చెమటోడ్చి పనులు చేయ్*
*కూలి డబ్బులాలి చేతిలో బెట్టు*
*అప్పుడే యామె చేతులు నిన్ను బట్టు!*

**17.** **పుత్తడి గల వాడి పృష్టంబు పుండైతే**
**వసుధలోన జాల వార్త కెక్కు**
**పేదవాని యింట పెండ్లైన నెరుగరు**
**విశ్వదాభిరామ వినురవేమ !**

*డబ్బులున్న వాడి బుడ్డ గూడ వార్తే*
*జగతి లోన దాని గూర్చి సాగేను చర్చ*
*తిండి కూడ లేని వాడి తండ్రి పోయిన గాని*
*పక్కింటి వారికైన కబురే కదలదుగా!*

18. **లోభి వాని జంప లోకంబు లోపల**
**మందువలదు వేఱు మతము గలదు**
**పైక మడుగ జాల భగ్గున పడి చచ్చు**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*పిసినారిని చంపుట బహు తేలికేగా*
*అప్పు అడిగితే చాలు గుప్పు మను వాడి శ్వాస*
*డబ్బుల చప్పుడే వాడి గుండె చప్పుడు చూడ*
*బిచ్చ మడిగిన గాని గుండె చప్పుడు ఆగిపోవుగా!*

19. **తండ్రి సొ మ్మదైన దాయాది సొమ్మైన**
**బరుల సొమ్ములైన బ్రాప్తధనము**
**దయను దీనులకును దాన మిచ్చిన వాడె**
**బహుళ పుణ్యజనుఁడు పరగ వేమ!**

**తనదు సొమ్ము జూడ దానమియ్యగ వచ్చు**
**నవని దొడ్డగా దదెవరికైన**
**నదురు బెదురులేక యన్యుల సొమ్ముల**
**దానమిచ్చు టేటి తగవొ వేమ?**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*దానమిచ్చే గుణముండే వాడికి*
*ధన మెవడిదనే విచక్షణే వుండదు*
*తండ్రిదైనా తన వెలయాలిదైన*
*వెరువక ఆ సొమ్ము పాత్రునికే యిచ్చు!*

20. **అన్నమడుగ నతని కన్నంబుఁ బెట్టిన**
**పారవేయు దాని ఫలిత మేమి?**
**ధనికునకు నొసంగు దానంబునటువలె**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

**ఆఁకలన్న వాని కన్నంబు బెట్టిన**
**బట్టె దన్ను మైన బెట్ట లేదు**
**లంజదాని కొడుకు లంజెలకిచ్చురా**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*కడుపు నిండిన వాడి కన్నంబు పెట్టకు*
*తినలేక యా అన్నమును పారవైచు*
*ఆకలితోనున్న వాని కన్నంబు పెట్టితే*
*వాడు తృప్తి చెందు దైవంబు దీవించు!*

**21.** **ఓజమాలు పొలఁతి యోలి మాడలచేటు**
**పోటు కెడలు బంటు కూఁటిచేటు**
**పనికిమాలు దాసి బత్తెంబు చేటురా**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*మాట వినని  పెళ్లానికి పెట్టిన మూట చేటు*
*ఖడ్గ వీరుడు భయపడితే వాడికై ఖర్చు దండుగ*
*చెప్పినది చేయని సేవకునికిచ్చే బత్తెం దండుగ*
*అపాత్రదానం దానగుణానికే తీరని వేటు!*

**22.** **ఆలు బిడ్డలనుచు నతిమోహముననున్న**
**ధనముమీద వాంఛ దగిలియున్న**
**నట్టి నరులకెల్ల నవని ముక్తియె లేదు**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*భార్యా పిల్లల కోసమై మమకారం*
*పసిడి కోసమై సంపదల చేర్పు కోసమై*
*మోహావేశాల జీవితం వదలకుంటే*
*మోక్షం నీకు దూరమవడం ఖాయం!*

**23.** **చెట్టు నందు విత్తు బుట్టెను**
**చెట్టును విత్తందే బుట్టె చెలిమి తలిర్పన్**
**చెట్టును విత్తును రెండును**
**బుట్టిన విధి దెలియ కలయు భువిలో వేమా!**

*చెట్టు ముందా విత్తు ముందా*
*అనవసర తర్క మీమాంసగా*
*గుడ్డు ముందా పిల్ల ముందాయనేది*
*ప్రకృతిలోని నిజమే గదరా!*

**24.** **ప్రియము లేని విందు పిండి వంటల చేటు**
**భక్తి లేని పూజ పత్రి చేటు**
**పాత్ర మెరుగ నీలి బంగారు చేటురా**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*ప్రేమ లేని భోజనానికి పిండి వంట దండగ*
*మనసు లేని పూజకైన పూలు పూర్తిగా దండగ*
*మెరవని పసిడి గిన్నెకు పెట్టిన సొమ్ము దండగ*
*యిట్టి పనులు చేయు వాని బతుకే దండగ!*

**25.** **ఈఁగ తేనె రుచికి నింపుగాఁ జచ్చును**
**ఓగు కామరుచికి నొఱిగి చచ్చు**
**త్యాగి గాని వాని ధర్మమ్మడుగఁ జచ్చు**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*తేనె వాసనకు తబ్బిబ్బై ఈగ దానిలోనే చచ్చు*
*తిరుగుబోతు వాడు వెలయాలి వాకిటే చచ్చు*
*దానగుణము లేని లోభి వాని ధనమడిగిన చచ్చు*
*కుళ్లుబోతు వానికి మంచి చేయుటెపుడు వచ్చు ?*

**26.** **మతము దారి మఱచు మధురాధరము జూచి**
**మగువ రూపు జూచి మనసు మఱచు**
**ఉరము జూచి సర్వయోగంబు మఱచురా!**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*రతము కొరకు, కోమలి కౌగిలి కొరకు*
*రంగు, రూపము, జాతి, తెగల బేధము లేదు*
*ఆకలితో నకనకలాడే వాడి తిండి కొరకు*
*రంగు, రుచి, వాసనల పట్టింపు లుండునా?!*

**27.** **కాంతమీదియాశ కనకంబుపైనాశ**
**లేనివాఁడు పుడమి లేనివాఁడు**
**కబురులేలఁ జెప్పఁ గాన్పింప దెలియరా!**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*కాంతను జూచి కళ్లార్పని వాడు*
*తరుణి వంపులు జూచి తడబడని వాడు*
*హేమాన్ని కూడబెట్టని హేమాహేమి ఎవడు యిలలో*
*అట్టి వానికి మనము తలవంచి మొక్కవలె వేమా!*

**28.** **చెమట కారునట్టు చట్టను శ్రమ పెట్టి**
**గడియించి అన్నంబు కుడువవలెను**
**తల్లిదండ్రుల సొమ్ము తినుట కారాదురా**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*చెమట కారనట్టి శ్రమ లేని బ్రతుకేల*
*తాను సంపాదించని ధనముతో దశ ఏల?*
*తాత తండ్రుల ఆస్థిపై జీవించు వాడధముడు*
*పరాన్నభుక్కు కన్న వాడేమి పెచ్చు గాదు!*

**29.** **అక్షరం బెఱుఁగని యాచార మదియేల**
**తాను దినని యట్టి ధన మదేల**
**నొరుల మేలుఁజూచి యోర్వని తనువేల**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*అజ్ఞాని కేమి తెలియును ఆచరణ గూర్చి*
*యితరుల బాధించి పోగు వేసిన ధనము*
*మంచి పనులకు వెచ్చించని మనుగడేల?*
*పరుల ఎదుగును జూచి పొగిలేటి బ్రదుకేల?!*

**30.** **ద్వారబంధమునకుఁ దలుపులు గడియలు**
**వలెనె నోటి కొప్పుఁ గల నియతులు**
**ధర్మఱిఁగి పలుక ధన్యుఁడౌ భువిలోన**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*యింటిని కాపాడు ద్వార బంధాలు*
*వాటికి కావలె సరియగు తలుపులు, గడియలు*
*మాటలె మనుజుని వర్తనము దెలుపు*
*ధర్మమున్న మాటలు ధన్యతను జేకూర్చు!*

**31.** **కుండ కుంభ మంద్రు గొండ పర్వతమంద్రు**
**యుప్పు లవణమంద్రు యొకటి గాదె**
**భాషలింతె వేరు పరతత్వ మొక్కటే**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*కుండ, కడవ, కుంభము లన్ని తెలుగు మాటలే*
*గుట్ట, కొండ, పర్వతము లకు యొకటే అర్ధముగా*
*వుప్పు, లవణము, గల్లు, పర్యాయ పదములే*
*ప్రాంతానికొక మాట యుండు గాని, దాని అర్ధమొకటే*
*భాషలు వేరైన మనసులో భావమొకటే!*

**32.** **కలుష మానసమునఁ గాన్పింపఁగా రాదు**
**అడుసులోన భానుఁ డడగినట్లు**
**తేటఁనీరు పుణ్యదేహ మట్లుండురా**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

కుళ్లు మనసు వాడి తెలివి ఏమన్నట్టు
బురద నీటిలోని సూర్యబింబమైనట్టు
స్వచ్ఛముగ గన్పట్టు తేట నీటిలోన
మనసు స్వచ్ఛమైన మాటలు తీపిరా!

**33.** **ఓగునోగు మెచ్చు నొనరంగ నజ్ఞాని**
**భావమిచ్చి మెచ్చుఁ బరమ లుబ్ధుఁ**
**బంది బురదమెచ్చుఁ బన్నీరు మెచ్చునా?**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*వెధవను జూచి మెచ్చు మరొక వెధవ*
*లోభి వానికెవని జూచినా భయమే*
*పంది పన్నీటిని మెచ్చునా మురుగు దప్ప*
*ఎవరికేది నచ్చునో దానినే మెచ్చెదరుగా!*

**34.** **కొమ్మ ద్రిమ్మరైన ద్రిమ్మరుల వలచు**
**సరస విటుల నేల సమ్మతించుఁ**
**బేడతిన్న పురుగు బెల్ల మేమెఱుఁగురా**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*తిరుగుబోతు ఎపుడూ తిరుగుబోతునే గోరు*
*మంచి వాడిని జూచి వెలయాలు మెచ్చునా?*
*పేడపురుగు ఎప్పుడూ పేడ తోడయాడు*
*పెంట దినెడి కుక్క చెఱకు తీపెరుగునా?!*

35. **ఎంత కడుగ నోటి యెంగిలి బోవునా**
**యకృతము లిడు నోరు యదియు నోరె**
**యనుదినంబుఁ జూడ యనృత మాడెడు నోరె**
**నోరు గాదు క్రింది నోరు వేమ**

*నోటి యెంగిలి కడిగినంతనే బోవు*
*కల్లలాడు నోరు కడిగినా వెలుగునా*
*నోరు మంచిదైన యూరే మంచిదౌను*
*చెడ్డ మాటలు బల్కు నోరు గుదముతో సమమౌను!*

36. **గంపెడంత తవుడు గంపలోఁ బెట్టక**
**చన్ను పట్ట నీదు కొన్న బఁట్టె**
**వారకాంత కేల వలచెద రూరక**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*కొత్త బట్టెను చన్ను పట్టవలె నన్న*
*బుట్ట లోన తవుడు చూపవలె నన్న!*
*వారకాంత వద్ద వరుస కలపవలె నన్న*
*మడులు, మాణిక్యాలు మెండుగా జూపవలె నన్న!*

37. **లవణ మెంత? దాని లాభంబు గననెంత**
**కొద్దిదనుచు నెన్న గూడునయ్య**
**భోగమేటికి? నుప భోగంలెక్కకు**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*ఉప్పేంటి లేయని ఉత్త మాటలు వద్దు*
*దాని విలువ మన తిండిలో యుండును*
*భోజనమునకు రుచి తెచ్చున దుప్పే గదా!?*
*ఉప్పు అట్టిట్టయిన ఎదను దాకు !!*

38. **మదముచేత లోకమాయలు తెలియదు**
**మదముచేత తన్ను మఱచునెపుడు**
**బుద్ధిలేని పసుల పోలిక జెడుదురు**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*తన్ను తాను తెలియ లేదు మదముయున్న*
*జగతి లోని అవకతవకలన్నీ తెలియు మదము యున్న*
*మదము విడిచెనేని మంచి చెడు తెలియును*
*మదము నల్ల మందు, గర్వమును విడనాడు!*

39. **కసవుఁ బసికిఁజేసె గాలి ఫణికిఁజేసె**
**మన్నెరలకుఁ జేసె మరవకెట్లొ**
**కుంభిని జనులకును గూడట్లు చేసెరా**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*ఆల మందలకు పచ్చిగడ్డి నిచ్చె*
*నాగులకాహారముగా గాలి నిచ్చె*
*వానపాములకు మట్టిని తినుట కిచ్చె*
*నరుల కేమో బువ్వను, రొట్టెలను యిచ్చె*
*ఆ విధముగా సృష్టి కర్త జీవులకు తిండి నిచ్చె!*

40. **పరయువ తితరంబు పాటించి కోరిన**
**కోటి పూజలెల్ల గొల్లబోవు**
**సెగకు చెంత వెన్న చెడదె తాపముచేత**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*కోరికలు చల్లార్చ కోమలి రతి కోరితే*
*చేసిన పూజా పునఃస్కారములు పక్కన బెట్టు*
*వెన్న ముద్ద ఎంత పరిమాణమ్మైనా*
*అగ్నిహోత్రుని దరిని ఆజ్యమైపోవుగా!*

41. **చదువునెల్ల చదివి సర్వజ్ఞులై యుండి**
**బ్రహ్మవిద్యలెల్లఎగట గల్పి**
**పడతి దలచినంత పరమయోగము మాను**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*ఎన్నో విద్యలు నేర్చిన విద్యావంతుడు*
*వేద వేదాంగాలు పుక్కిటపట్టి*
*ఆడదాని గాలి తగిలినంతనె చలించి*
*పరమయోగము మాని పడతి చెంతకు చేరు!*

42. **గురువు తానయినను హరునిఁ దాఁ జూపును**
**బ్రహ్మలోక మతఁడు పారఁజూపు**
**శిష్యు నరసినట్టి చీకటిఁబాపురా**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*గురుడు దైవతంబు, దైవమును జూపును*
*దైవ లోకమును నిచటి నుండే జూపు*
*శిష్యుని చెయి బట్టి వదలక దాజూపు*
*వెలుగు వైపుకు మార్గమును జూపి చీకట్ల తొలగించు!*

43. **తల్లిబిడ్డలకును దగవు పుట్టించెడి**
**ధనము సుఖము గూర్చునని గడింత్రు**
**కాని యెల్లయొడల ఘన దుఃఖ కరమది**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*డబ్బు యిచ్చును మనకు గబ్బు*
*అది నీ జ్ఞాన సూర్యునికే మబ్బు*
*డబ్బు తల్లిదండ్రుల దూరాన బెట్టు*
*పెళ్లాం బిడ్డలు నిన్ను ఆవలకు నెట్టు!*

44. **చచ్చు వారలెవరు? చావని వారెవరు?**
**చచ్చి బ్రతికి యుండు జనము లెవరు?**
**విచ్చల విడిగాను వివరించి చూడరా!**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*చావులేని మనుజుడు ఎక్కడున్నాడు*
*చచ్చియు బ్రతికి యుండు వార లెంత మంది*
*మనుజుల మదిలో మెదలాడు వారే దేవతలు*
*పుణ్యకర్మలె జనులకు గుర్తుండు నెపుడు!*

45. **పరుల కుపకరింపఁ బాప క్షయంబగుఁ**
**బరుల కుపకరింపఁ బట్టుఁ గొమ్మ**
**పరుల కుపకరింప పరలోక సాధన**
**పరుల కుపకరింప బలిమి వేమ!**

*ఎదుటి వారికి సాయం, నీ పాపాలు మటు మాయం*
*ఎదుటి వారికుపయోగ పడు, అక్షయ పాత్రవు కమ్ము*
*ఎదుటి వారికి చేయూత నిస్తే పరలోక సుఖ ప్రాప్తియగు*
*ఎదుటి వారికి నీ శక్తి ధారపోస్తే నీ శక్తి యినుమడించు!*

46. **బడుగు నెఱుగలేని ప్రాభవంబది యేల**
**ప్రోది యిడని బంధుభూతి యేల**
**వ్యాధి దెలియలేని వైద్యు డేరికి నేల**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*బడుగు ప్రజలను ధ్ధరించని పరిపాలనేల*
*అక్కఱకు రాని బంధువుల మంద ఏల*
*రోగ నిర్ణయము లేని వైద్యమేల*
*విశ్వదాభిరామ వింత గనుమా వేమా!*

**47.** **మాటలుడుగకున్న మంత్రంబు దొరకదు**
**మంత్ర ముడుగకున్న మది కుదరదు**
**మనసు నిలుపకున్న మతి ముక్తి లేదయా!**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*మంత్రాలు కావలెనన్న వట్టి మాటలు కట్టి బెట్టు*
*మనసును కట్టి వేయవలె నన్న మంత్రాలు వదిలి బెట్టు*
*మనసు నిలకడ లేనిచో ముక్తి వేట కట్టి బెట్టు*
*వీటికై క్రమముగా పట్టు బట్టి, జీవితాశయము పై ఒట్టు పెట్టు !*

**48.** **జిహ్వాలంపటంబు జీవనంబై యుండు**
**జిహ్వా లంపటంబై జీవపోష**
**జిహ్వాచేత జనులు చిక్కి నొచ్చిరి గదా!**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*మాటలాడు పశువు మానవుడొక్కడే*
*మాట వలన వాని బ్రతుకుకే తిప్పలు*
*నోటి లోని నాల్క జీవనాధారంబయి నను*
*నాల్క నదుపున పెట్టువాడే యందరికి హితుడు!*

**49.** **అల్లుని కగు మృతికి నాత్మఁజింతించును**
**తనయు మృతికిఁ దానె తల్లడిల్లు**
**పుణ్యపురుషు మృతికిఁ భూమిలో జనులకి**
**యుగము గ్రుంగినట్టు లుండు వేమ!**

*అల్లుడు చనిపోతే మనమున గుబులు గలుగు*
*కొడుకు చనిపోతే తల్లడిల్లి పోవు మనసు*
*గొప్పవారు గతిస్తే జనమంతా దీనులగుదురు*
*నాయకుడు పోయినచో భూమియే కృంగురా!*

50. **నీచగుణములెల్ల నిర్మూలమైపోవు**
**కొదవవేలేదు సుజన గోష్టివలన**
**గంధ మలద మేని కంపడcగిన యట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*చెడ్డ గుణములన్ని మంచి సాంగత్యమున బోవు*
*మంచి వారి తోటి మనకు నష్టమే రాదు*
*మంచి గంధమల దిన మాయమై పోవు*
*దేహమందలి దుర్గంధము క్రమము గాను!*

51. **అన్నము తినువేళ నాత్మరుచులcగోరు**
**టదియు నాల్క సెప్ప నడుcగు మనసు**
**నాత్మకుc దృణమైన నయ్యయ్యో యనరాదు!**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*అన్నం దినే వేళలోనే మనసు రుచులు గోరు*
*నాల్క మనసుకు నచ్చ జెప్పును గదా*
*నాల్కను అదుపులో పెట్టే అయ్య వారే మనసు*
*అందుకే అంతరంగమును బట్టి మాటలుండు!*

52. **తేనె, పంచదార, తియ్యమామిడిపండుc**
**దిన్నcగాని తీపిc దెలియరాదు**
**కన్న నింపుపుట్టుc గామిని యధరంబు**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*జుంటి తేనె, బెల్లం ముక్కలు, మామిడి రసాలు*
*వీటి రుచులు తిన్న మీదటనే విదితమౌను*
*కానీ, కాముకుని కనులకు కామిని అందాలు*
*కాంచగానే కులుకు పెచ్చరిల్లును గదా!?*

**53. గుణములు గలవాని కులమెంచగానేల**
**గుణము గలిగెనేని గోటిసేయు**
**గుణములేనివాని కులమెంత గొప్పైన**
**నెంచవలదు నీచు డెన్న వేమ.**

*కుల మెంచగానేల గుణమె బలము*
*గుణవంతుని గుణమే కోటి రూకలు సేయు*
*గుణము లేని వాడు దుబ్బుకైన కొరగాడు*
*గొప్ప గుణములున్న కులగోత్రములకు మిన్న!*

**54. తీపికెల్ల దీపి తెలియంగ బ్రాణంబు**
**ప్రాణవితతి కన్న బసిడి తీపి**
**పసిడికన్న మిగిల పడతి మాటలు తీపి**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*ప్రాణమంటే తీపి మనజునకు ధరలోన*
*దాని కన్న పసిడి మేతయె బహు తీపి*
*వీటి కంటెను అత్యధికమైన తీపి*
*అతివ అధరములు, వారి మాటలే అతి తీపి!*

**55. వీరుడైన రాదు విద్య నేర్చిన రాదు**
**చదువు నేర్వరాదు సటుల రాదు**
**జన్మ ఫలమె ముక్తి జపియించినను రాదు**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*వీరుడు గానీ, విద్యావంతుడు గానీ*
*జీవితాంతం నిష్టతో తపస్సు చేయవలె*
*గ్రంధాలు వల్లించిన రాదు, పూర్వ జన్మ కృతమ్మో గానీ*
*ముక్తి దొరకుట ఎంత కష్ట తరమో గదా!*

56. **వెలయ భూమి తల్లి విత్తనమట తండ్రి**
**పంటలరయ సుతులు పాడి పరము**
**ధర్మము తన పాలి దైవంబు సిద్ధము**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*ధరిత్రియే జనులకు తల్లి, ఆకాశమే తండ్రి*
*అలనాడు పంటలే పిల్లలు, ఆల మందలే ఆస్తులు*
*అట్టి ధర్మ యుగములో ధర్మమే దైవము*
*వీటిని పెనుగొని యుండుటే జీవిత గమ్యము!*

57. **కంబళముఁగట్టి గంతల గజ్జలు**
**బోడితలలు కాని బొంత చిరత**
**లాత్మదేవ పూజలవి సేయనేరవు**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*కంబళ్లు, బొంతలు, ఘల్లు ఘల్లు గజ్జెలు*
*నున్నటి గుండ్లు, సరి పంగనామాలు*
*ఎన్ని వేషాలైన భుక్తి కోసమే గాని భక్తికై గాదు*
*ఘనులను కునేరు వారిని, మాయలో పడకండి!*

58. **జాతి మతము విడిచి చని యోగికా నేల**
**జాతితోడ నున్న నీతి లెస్స?**
**మతములన్ని బాపు మనుజు డొక్కఁడు లేఁడు**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*యోగి కావాలంటే జాతి మతములు వదలి*
*ఎక్కడో తిరుగనవసరము లేదు*
*నీతిని వదల వలదు ఎన్ని వదిలిన గాని*
*యోగము తోడ ముక్తిని సుసాధ్యము చేసి కొమ్ము*

**59.** **ఉర్వి జనులకెల్ల నొక్క కంచము పెట్టి**
**పొత్తు కుడిపి కులము పొలయఁ జేసి**
**తలనుఁ జెయ్యి బెట్టి తగనమ్మఁ జెప్పరా**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*ఊరి వాళ్లంతా ఒకచోట కూర్చుండి*
*సహ పంక్తి బువ్వను సంతసముగా జేసి*
*ఒట్టు పెట్టుకొండి తలపై చేయి పెట్టుకొని*
*కులములొద్దని కుమ్ములాట లొద్దని!*

**60.** **పుట్టిన జనులెల్ల భూమిని మనియున్న**
**పట్టునే జగములు పట్ట వెపుడు**
**యముని లెక్కరీతి సరిగి తగ్గుచునుండు**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*పుట్టిన ప్రతి వాడు గిట్టకున్న ఎడల*
*చాలునా భూమిపై చోటు లెక్క చూడ*
*చిత్రగుప్తుని లెక్క పక్కాగ యుండురా*
*వంద పైన బ్రతుకుట ఎవరి వల్ల కాదురా!*

**61.** **ఆకుమీఁద వ్రాత యందటికిఁ దెలియ**
**చేతిలోన వ్రాత జెప్పవచ్చు**
**తోలుక్రింది వ్రాత దొడ్డవాఁ డెఱుఁగురా**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*తాళ పత్రములపై వ్రాత చదువరులు చెబుదురు*
*చేతి లోని గీతలను సాముద్రికుడు చెప్పు*
*కన్పించని నుదిటి వ్రాతలను గీతలను జెప్ప*
*మానవ మాత్రునికి సాధ్యము కాదు యిలలో!*

**62.** **ఆశవిడకకాని పాశముక్తుఁడు కాదు**
**కాదు ముక్తుడైనఁ గాని మృతుఁడు**
**మృతిని బడయకున్న క్షితి మోహమూడదు**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*బంధనాలు తెంచాలంటే కోరికలను విడనాడాలి*
*బంధ విముక్తుడే మర్త్యుడు అవుతాడు*
*భువిపై గల బంధాలను తెంచుకుని*
*చితి మీది కేగు వాడే బంధ విముక్తు డౌతాడు!*

**63.** **అన్యులకువచ్చు నాపద తనదిగా**
**నెన్నువాఁడు భువిని నున్నవాఁడు**
**యెన్ని దానిలోన నిహపరంబులు లెస్సఁ**
**గన్నవాఁడు మిగుల ఘనుఁడు వేమ.**

*ఎదుటి వారి బాధను తనదిగా భావించి*
*పూర్తిగా సాయమ్ము చేయువాడు*
*సమాజములోని విషయాలను సంపూర్ణ రీతిలో*
*తెలుసుకొని నిర్వర్తించు వాడే ఘనాపాటి!*

**64.** **వూస పోగు పసిడి పుట్టంబు విద్యయు**
**కాయ పుష్టి చాల గలిగె నేని**
**కాని కులజుడైన ఘనుడని రమ్మందురు**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*పట్టు పీతాంబరాలు పస గల పచ్చలు*
*విద్య యుండి తగిన ఒడ్డు పొడుగున్న*
*కులము తక్కువ వాడైనా కాళ్లు మొక్కెదరు*
*ఘనుడవు నీవే ననుచు ఘనకీర్తి పాడేరు!*

**65.** **టంక మదుక కున్న బొంకంబుగా రాదు**
**స్వర్ణ భూషణంబు జగమెఱుంగు**
**భటుడు వెంట లేక ప్రభుడు శోభించునా**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*ఆభరణాలకు అతుకు తప్పనిసరి*
*బంగారము అతకాలంటే వెలిగార మవసరం*
*రాజు గారి దర్పం పెంచటానికై మార్బలం అవసరం*
*పరివారం ఉంటేనే రాచరికపు హంగులు గదా!*

**66.** **ఉపవసించు చుండి యోగి నీళ్ల మునిగియు**
**కూడు వండి వేల్పు గుడువు మనుచు**
**దాని నోరు కట్టి తామె తిందురు గదా**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*దాంభికులైన ఉపవాసులు నీట మునిగి*
*కూడు వండి నైవేద్యంబని పెరుమాళ్ కు పెట్టగా*
*నోరు లేని రాతి బొమ్మ నైవేద్యము ముట్టునా*
*తిరిగి మరల యా కూటిని వారే దిగమ్రింగెదరుగా!*

**67.** **సవతి తల్లి చూడ సాకులు నెరపును**
**స్వంత తల్లి వలెను సైప దెపుడు**
**వింతలడీచి లోని విజ్ఞాన మందరా**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*నీకు మంచి జరుగ స్వంత తల్లే కోరు*
*సవతి తల్లి ఎపుడూ కుంటి సాకులు చెప్పు*
*ఈ మాయలన్నింటిని నిశితంగ గమనించి*
*నీలోని జ్ఞానికే కట్టుబడి పని చెయ్యి!*

**68.** **సక్తి గలుగు పనులు చక్కగా నెఱవేఱు**
**భక్తి గలుగు పూజ ఫలము నిచ్చు**
**యుక్తి గలుగు మాట యొప్పునురా భువి**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*చక్కని పనులు ఆసక్తితోనే సాధ్యమ్ము*
*భక్తి తోడి పూజకే మంచి ఫలితమ్ము*
*సుయుక్తితో జెప్పిన మాటకే విలువ రా*
*యివన్నీ మనకు ఈ భువి లోనే గాన్పించు!*

**69.** **వ్రాతవెంటగాని వరమీడు డా దైవంబు**
**చేతికొలదిగాని వ్రాతగాదు**
**వ్రాతకజుడు కర్త నీతికి తా గర్త**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*నీ చేతలకు కర్తవు నీవే స్వయముగా*
*నీ నుదిటి వ్రాతకు కర్తయా బ్రహ్మమేగా*
*ఈ వ్రాత చేతల కన్న ఎక్కుడు కావలెనన్న*
*ఎవడ్ని అడిగినా యియ్య లేరు నిక్కముగా!*

**70.** **ప్రధమమున మాతృ దేవత**
**పదపడి జనకుండగుటను బరికింప నికన్**
**గుదిరిన సదమల గుర్తుడే**
**తుదిదైవము పెరలు లేరు దొరలెట వేమా!**

*అమ్మకు ప్ర ప్రధమ నమస్కారం*
*తండ్రికి తరువాత, గురువుకు ఆపైన*
*అందర్నీ ఆదుకునే ఆ దేవునికి కష్టాల లోనే*
*తాను లీనమైన ప్రకృతి మాతకు సర్వదా తలవంచు!*

71. **గురుని శిక్షలేక గురుతెట్లుఁ గల్గునో?**
**అజుని కైన వాని యబ్బ కైన**
**తాళపుఁజెవి లేక తలుపెట్టు లూడును?**
**విశ్వదాభిరామ వినురవేమ !!**

*శిక్షణ లేని విద్య జనులకు విదితమౌనా*
*బ్రహ్మకైనా వాడబ్బ శేష శాయికైనా*
*గురువు మాట మూసిన తలుపుకే చెవియట*
*తెలియక చీకట్లో తచ్చాడు టెందుకు?!*

72. **కష్టమైన మలము కడుపులో నుండంగ**
**నంతకంటెఁ జెడెడి దన్నరసము**
**ఉపములేని జనము లుపవాసముందురు**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*మలము కడుపు నుండ కష్టమే తినుట*
*బిగుతు కడుపు లోకి చేరునా అన్నంబు*
*తెలివి లేని జనులు ఉపవాస ముందురు*
*గోరు వెచ్చని చారుతో ఉపచార మీయవలె!*

73. **రచ్చకు నిచ్చుక మాడెడు**
**కుచ్ఛితమౌ లోకనింద కోవిదునకు నీ**
**తుచ్ఛపు గుణమును నీచపు**
**మచ్ఛరమును నున్న చెఱచు మహిలో వేమా!**

*రచ్చబండ వద్ద యిచ్చ కాలాడకు*
*మంచి వాడవైనా లోకనింద వచ్చు*
*యితరుల పై ఓర్వలేని తనాన్ని*
*చూపకుండుటే నీ కీర్తి కాపాడుకొను త్రోవ!*

74. **రజ్జు నహిగాను తోచు విరక్తి కలుగ**
**స్థాణువు నరుడగా తోచు సంగ తెరిగి**
**లోని యెఱుకను జయమంద బూనవలెను**
**భ్రాంతిమాయదె పరికించి నంత వేమ.**

*భ్రాంతి యె కారణము త్రాటిని త్రాచనుటకు*
*రాతి బొమ్మ మనిషిగా కాన్పించుట కును*
*నిజము గ్రహించుట లోన తెలివి కావలెన్*
*మాయయె మూలము, ఎండమావుల్లోని కన్పట్టు నీటికిన్!*

75. **శాంతమె జనులకెటు జయము బొందించును**
**శాంతముననె గురుని చేరవచ్చు**
**శాంతభావ మహిమ సరిచెప్పరాదయా**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

*శాంత స్వభావమ్ము సౌఖ్యానికి నాంది*
*శాంత గుణమే మానవుని రక్ష కవచమ్ము*
*జీవితానికి వలసిన గురుడు దొరకాలంటే*
*శాంత గుణమును మనుజుడు సాధించవలెను!*

76. **కడcగి గాలిలేని గగనంబు భంగిని**
**బలు తరcగలు లేనిc జలధి మాడ్కి**
**నిర్వికారమునకు నిశ్చలత్వమున దా**
**నుండెనేని ముక్తి యొనరు వేమ.**

*నిశ్చల ఆకాసం వలె, అలలు లేని అంబుధి వలె*
*నిర్వికార తత్వములో, నిశ్చలత్వములో*
*మానవుని మస్తిష్కముండేనేని, అదియె*
*తగిన స్థితిగా గుర్తించు, ముక్తికి అనువు గాను!*

77. **అరయఁగ దొంగలఁ బట్టుక**
**మరణము నొందించి యొకని మన్నింపదగున్**
**వెర వెరుగు నిట్టి వారికి**
**నిర వందిన యెఱుకఁ గల్గు నిదియే వేమా.**

*ఆరు విధముల దొంగల దోపిడీని*
*ఆట కట్టించు మరియు అంతమొందించు*
*జ్ఞాన దీపమును మనసున వెల్గించు సుమతుల్*
*యుర్వి జనులకిచ్చిరి ఎఱుకను కానుకగ చేసి!*

78. **అరయ సుఖమొంది దుఃఖమ్ము నార్పలేక**
**విధిని దూరంగ ఫలమేమి? వేడు కలర**
**బుద్ధినొక్కినఁ బరిపూర్తిఁ బొందునయ్య**
**యట్లు కా కూరకయె యుండ నగునె వేమ.**

*సుఖాల మరిగిన వాడు దుఃఖమును ఈసడించు*
*సృష్టి కర్తనె దునుమాడు, దుయ్య బట్టు*
*నిజ బుద్ధి నుపయోగించి యిక్కట్ల నధిగమించడు*
*ఊరక ఎవరి కోసమో వేచి యుండ నేమి ఫలము?!*

79. **ఉచ్చను బుట్టిన తనువుకు**
**యెచ్చోటను యేదికులము యేది నిజంబౌ**
**మచ్చరము మాను సత్యము**
**యచ్చుపడ న్నిలిచెనేని యధికుఁడు వేమా.**

*ఉచ్చ వచ్చే చోటు నుండి వచ్చినావు*
*మనుషులంతా యా గుప్త ప్రదేశ జనితులే*
*కులబేధాలన్ని ఎచట నుండి పుట్టినాయ్?*
*మద మాత్సర్యాల నెట్టి సత్య జీవనముల అలవరచుకో!*

80. ఒడలు నల్లనైన నోరుపుగల సతి
గుణము మేల్మిఁబట్టి కోటినేయు
ప్రాత యెనుముపాలు రోఁతన వచ్చునా?
విశ్వదాభిరామ వినురవేమ

*అందచందాలు లేని అతివను సతిగా*
*యింటి పరువును బరువును నిల్పుటకై వుంచితే*
*ఆమె విలువ చూడ కోటి రూకలు సేయు*
*బఱ్ఱె నలుపుదైనా దాని పాలు చూడ తెలుపే గదా!*

81. కలిమి సుఖదుఃఖములకును గారణంబు
సంపదలు గల్గు నెవరికి శాశ్వతంబు
తెలివి సంపదఁ గలవాఁడె దేవ సముఁడు
నిత్యమది హర్ష దాయిని నిజము వేమ.

*సుఖదుఃఖాలు మెండుగా ధనము వలనే గల్గు*
*ఎల్ల వేళలా సంపదలు ఎంతమందికి గల్గు?*
*తెలివి గలవాడె సంపన్ను డందరి కంటెనూ*
*నిత్య సంతోషి ఎన్నడైనా ధనవంతుడే సుమా!*

82. కలిమిగల యతనికిఁ గానుక నిచ్చుట
బావినీరు నదికి పొఱ్చి నట్లు
నిమ్మకు నిలరాశి నీరెత్తి నట్లుండు
బేదకియ్య మనువు పెరుగు వేమ.

*నదికి నీరునిత్తు వా, యది వెర్రితనమే గదా?*
*నిమ్మకు నీరిస్తివా ఫలాన్ని ప్రతిఫలిస్తుంది*
*పేదవాని కిచ్చిన కాన్క కొత్త జన్మనిస్తుంది*
*ధనవంతుని కిస్తే యది విలువ లేని దానమే!*

**83.** **జాతి, నీతివేఱు జన్మం బదొక్కటి**
**అరయఁ దిండ్లు వేరె యాఁక లొకటి**
**దర్శనములు వేఱు దైవమౌ నొక్కటి**
**విశ్వదాభిరామ వినురవేమ**

*నాగరికతలో జాతి, నీతి, మూతి*
*వేరైన గాని బ్రదుకు తీరు మారునా?*
*తినే తిండ్లు వేరైనా కడుపు మంట ఒకటేగా!*
*పూజ పద్ధతి వేరైనా దైవమ్ము ఒక్కడే గదా!*

**84.** **కూడుఁబెట్టకున్నఁ గుక్షిలో జఠరాగ్ని**
**భక్షణంబుఁ జేయు గుక్షి మలంబుఁ**
**గూడు విడచి మలము గుడుచురా యుపవాసి**
**విశ్వదాభిరామ వినురవేమ**

*ఒక పూట తిండి మానితే కడులోని మంట మలము తినును*
*మలములో మిగిలిన శక్తి తోడ మనుజుడు బ్రతుకును*
*ఉపవాస మున్నవాడు మలానికి పరోక్ష భక్షి యా*
*విషయం తెలిస్తే విన బుద్ధి గాదు, తిన బుద్ధి గాదయా!*

**85.** **పతిసుతు లిద్దరుఁ గూడియు**
**సతి కిరుగడ పవ్వళిం సంతత దృష్టిన్**
**బతిఁజూచు మాంసపిండము**
**సుతులందలి పాలప్రేమఁ జూతురు వేమా!**

*ఒక వైపు భర్త మరొక వైపు సుతుండు*
*రెండు చేతుల వెదుకులాట తన రొమ్ము కొరకె*
*ఒకటి దేహ తృప్తి కొరకు మరొకటి జీవనంబు కొరకు*
*రెంటిని సమతుల్య పరచు స్త్రీయె ధన్య గదా!*

**86.** **ప్రభున కిచ్చినట్లు రహిఁ బేదలకు నీరు**
**వనిత కిచ్చినట్లు వటున కీరు**
**సురకు నిచ్చినట్లు సుమతుల కియ్యరు**
**మనసు పదిలపడమి మహిని వేమ.**

*రాజు కిచ్చినట్లు బీదలకియ్యడు*
*మగువ కిచ్చినట్లు కుంక కీయడు*
*మదిర కిచ్చినట్లు సుమతుల కీయడు*
*అట్టి వాటి గూర్చి అట్టే వ్యధ చెందకుమీ!*

**87.** **అంతరంగమందు నపరాధములు చేసి**
**మంచి వానివలెను మనుజుఁ డుండు**
**యితరు లెఱుఁగకున్న నీశ్వరుం డెఱుఁగడా**
**విశ్వదాభిరామ వినురవేమ**

*లోలోపల తీరని కోర్కెలకే ఏదో చేయాలనే తహ తహ*
*పైకి మాత్రము అందరి కోసమై అయ్యవారి అనుష్టానాలు*
*తాను చేయు పనులు, తా మనసులోని మాట*
*తెలిసిన వాడొకడున్నాడని ఏల మరచి మనునో?!*

**88.** **తల్లిదండ్రిమీద దయలేని పుత్రుండు**
**పుట్టె నేమి వాఁడు గిట్ట నేమి**
**పుట్టలోనఁ జెదలు పుట్టవా గిట్టవా!**
**విశ్వదాభిరామ వినురవేమ**

*తల్లి దండ్రుల పట్ల దయలేని సుతుడు*
*వుండిన నేమి? చావగా నేమి?*
*తల్లికి దా బుట్టి తరుణి వలలో బడి*
*దాసుడై జీవించు ధరణిలో చూడ!*

89. **తనకు లేనినాఁడు దైవము దూఱును**
**తనకుఁ గలిగెనేని దైవమేల**
**తనకు దైవమునకుఁ దగులాటమే శాంతి**
**విశ్వదాభిరామ వినురవేమ**

*అన్నీ వుంటే తనంత వాడు లేడని ధీమా!*
*కరువు కాటకల్లో దేవున్ని తిట్టు దామా?*
*మనిషి దా సృష్టించిన దేవునికీ యున్న బంధమేమి*
*విశ్వదాభిరామా! ఈ వింత గనుమా!*

90. **ధనమౌ మూలము జగమున**
**ధనమౌ మూలంబు సకల ధర్మంబులకుం**
**గొనామౌ మూలము సిరులకు**
**మనమౌ మూలంబు ముక్తి మహిమకు వేమా!**

*ధనమే మూలము జగతికి*
*ధనమే జగతిచక్రాని కిరుసు*
*ధనమే ధర్మానికి ఆయువు బట్టు*
*గుణమే సంపదలు గూర్చుటకు మూలము*
*మంచి మనసే ముక్తికి పీఠమ్ము భువిలో!*

91. **ధనముఁ గూడఁబెట్టి దానంబు సేయక**
**యూరకుండ్రు పాపులూహ లేక**
**ధనము వెంటరాదు ధర్మంబు సేయరో!**
**విశ్వదాభిరామ వినురవేమ**

*ధనము నంతయు ప్రోగు జేసి దాచి*
*తాను తినక యితరుల కీయక*
*అవసరానికై అప్పుగా నైనా యివ్వక*
*ఏడ దాచెనో దెలియకనే వేగిరము పైకి బోవు!*

92. **ధనములేమి సుతులు తప్పుల నిడుదురు**
**ధనము లేమిఁ బత్ని తాకరాదు**
**ధనములే మెవనికిఁ దాళియే యుండదు**
**విశ్వదాభిరామ వినురవేమ**

*కాసు లేని వాడు కసువుతో సమము*
*నీవు కన్న పిల్లల కైన, ఆ పిల్లల తల్లి కైన*
*చుట్ట పక్కాలు నిను చులకన చూతురు*
*బతికియున్న శవము లా భారమై పోదువు!*

93. **ఉప్పులేని కూర యొప్పదు రుచులకు**
**పప్పులేని తిండి ఫలము లేదు**
**అప్పులేనివాఁడు యధిక సంపన్నుఁడు**
**విశ్వదాభిరామ వినురవేమ**

*యింపొద వెడు నుప్పు లేక పుట్టునా రుచి?*
*పప్పు లేని మృష్టాన్నము గలదా భువిలో...?*
*అప్పిచ్చిన వాడు వాకిట్లో యుండగా*
*తీరికగా నీవు తినగల సంపన్నుడవా?!*

94. **కల్లనిజమురెండు కఱకంఠుఁ డెఱుఁగును**
**నీరు పల్లమెఱుగు నిజముగాను**
**దనయుని జన్మంబు తల్లిఁ దానెఱుఁగును**
**విశ్వదాభిరామ వినురవేమ**

*గరళ కంఠుడైన పరమ శివునికే*
*నిజానిజాలు నిక్కముగ తెలియులే*
*నీటి కెట్లు ఎత్తు పల్లాలు తెలియునో*
*తనయుని మూలము తల్లికే తెలియులే!*

**95.** **అన్ని దానములను నన్న దానమె గొప్ప**
**కన్నతల్లి కన్న ఘనత లేదు**
**యెన్న గురునకన్న నెక్కువ లేదయా**
**విశ్వదాభిరామ వినురవేమ**

*అన్న దానమన్న అధికతమ లెక్కరా*
*కన్న తల్లి యన్న కడిమి చెట్టు, కల్ప వృక్షమే!*
*గురుడు నీకు మార్గదర్శి జీవన పథానికి*
*అతనిని ఎన్నుకొనుటే నీ జీవన సాఫల్యత!*

**96.** **ఆశపాపజాతి యన్నింటి కంటె నా**
**యాశచేత యతులు మోసపోరె?**
**చూచి విడచువారు శుద్ధాత్ములెందైన**
**విశ్వదాభిరామ వినురవేమ**

*ఆశలూ, కాంక్షలూ అతి పెద్ద లోపాలు*
*గొప్ప యోగు లెల్ల వెలితి బడిరి*
*లోపాల కల్లంత దూరంగ యున్న వారే*
*యతులుగా చిరకాల మున్నవారు!*

**97.** **ఏమి కొంచు వచ్చె? నేమి తాఁ గొనుపోవు?**
**బుట్టువేళ నరుఁడు గిట్టువేళ**
**ధనము వెచటి కేగ? దానేగు నెచటికి**
**విశ్వదాభిరామ వినురవేమ**

*వచ్చేటపు డేమి తెచ్చావు నీ తోడ?*
*వెళ్లు నపు డేమి తీసుకొని పోగలవు నీ తోడ?*
*నీ బతుకంతా లెక్కల తోనే సరిపోయె*
*ఎవరికి అప్ప జెప్పి పోతావు ఈ లెక్కలన్నీ?!*

**98.** **తను వదెవరి సొమ్ము తనదని పోషించు**
**ద్రవ్యమెవరి సొమ్ము దాచుకొనగ**
**ప్రాణమెవరి సొమ్ము పారిపోకను నిల్వ**
**విశ్వదాభిరామ వినురవేమ**

*ఈ శరీరము నీదను కొనుటే భ్రమ*
*(ప్రే) భ్రమ తో పెంచి పోషించి నావు*
*ధనము ఎవరిదని (కోసమై) ప్రోగేసి నావు?*
*ప్రాణ మెవరి దని పోనీక పట్టేవు?!*

**99.** **నేర్పు గలుగువారు నెఱితనము గలవారు**
**విద్యచేత విఱ్ఱవీఁగువారు**
**పసిడి గలుగువారి బానిస కొడుకులు**
**విశ్వదాభిరామ వినురవేమ**

*నేర్పుతో చేయువాడు, నెరజాణ ఐన వాడు*
*మంచి కులము వాడు, గొప్ప గోత్రము వాడు*
*విద్య గర్వము చేత మతి చలించిన వాడు*
*ధనమదము గలవానికి వీఱందరూ దాసులే!*

**100.** **హీనుడెన్ని విద్య లిల నభ్యసించిన**
**ఘనుడు కాడు హీన జనుడె కాని**
**పరిమళముల గర్ధభము మోయ ఘనమౌనె?**
**విశ్వదాభిరామ వినురవేమ**

*(నీచ) హీనబుద్ధి వాడు విద్య లందిన గాని*
*గొప్పవాడు కాలేడు, హీనుడే గాని*
*పరిమళ ద్రవ్యాల మోసినప్పటి కిని*
*గాడ్దె ఎప్పటి కైన గజరాజు యవునా ?!*